

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతానగరం

2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 21 నుంచి 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బి.రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో సంవత్సరంలో మధ్యలో మానేసిన విద్యార్థులు, టెన్త్ ఉత్తీర్ణలై చదవకుండా ఖాళీగా ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తుల చేసుకొనే అభ్యర్థులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, పదో తరగతి ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ, పాస్‌పోర్టు సైజ్ ఫోటో మొదలైనవి అందజేయాలన్నారు. ప్రవేశమైన విద్యార్థులు మార్చి ఒకటి నుంచి ఏడో తేదీలోపు సంబంధిత పరీక్షల రుసుం చెల్లించాలన్నారు. ఏప్రిల్‌లో ఓపెన్ ఇంటర్ ఎగ్జామ్స్ జరుగుతాయని పేర్కొన్నారు.

అంటివలసలో విషాదం

అంతా ఒక ఊరి వారే.. ఒకే గిరిజన కుటుంబాలకు చెందిన సభ్యులే.. సమీపంలోని గ్రామానికి పెళ్లి చూపుల కోసం వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసి స్వగ్రామానికి ఆటోలో తిరిగి పయనమయ్యారు. విందు ముచ్చట్లు చెప్పుకొంటూ సరదాగా గడిపారు. మరి కాసేపట్లో గమ్యస్థానం చేరుకుంటారనగా, ఇంతలోనే ఉలికిపాటు.. రెప్ప మూసి తెరిచేలోపే నెత్తురు కారుతున్న చేతులు.. ముద్దయిన శరీర భాగాలు.. హాహాకారాలు.. అప్పటి వరకూ తమతోపాటు కబుర్లు చెబుతున్న వారే.. కళ్లెదురుగా విగతజీవులై పడి ఉన్నారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురు దుర్మరణం చెందిన ఘటన పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం చోళ్లపదం వద్ద చోటు చేసుకుంది. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది.



తల్లి శారద మృతి, తండ్రి అంధుడు కావడంతో అనాథలైన చిన్నారులు





సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

- ఆటోను లారీ ఢీకొని ఐదుగురు దుర్మరణం
- పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ మృత్యువాత

ప్రజాశక్తి-కొమరాడ, పార్వతీపురంరూరల్

కొమరాడ మండలంలోని దేవకోన పంచాయతీ అంటివలసకు చెందిన ఊయక లక్ష్మి కుమార్తె పెళ్లి సంబంధం కోసం ఒకే కుటుంబానికి చెందిన 13 మంది అదే మండలం చోళ్లపదం పంచాయతీ తుమ్మలవలసకు ఆటోలో వెళ్లారు. పెళ్లి చూపులు, భోజనాలు అనంతరం స్వగ్రామం వస్తుండగా చోళ్లపదం శివాలయం సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వీరి ఆటోను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఊయక నర్సమ్మ (40), ఊయక లక్ష్మి (42), మెల్లిక శారద (35), మెల్లిక అమ్మడమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఊయక వెంకటి (50), ఆటో డ్రైవర్ ఊయక వెంకటేష్, ఆరిక ప్రసాద్‌ను స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో వెంకటి మృతి చెందాడు. స్వల్పంగా గాయపడిన మరో ఐదుగురిని పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ జగదీష్‌నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఆటోలో ఇద్దరు చిన్నపిల్లలు కూడా ఉన్నప్పటికీ వారికి ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. మృతులంతా ఒకే గ్రామానికి, ఒకే కుటుంబాలకు చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. వెంకటేష్, ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిలో ఊయక లావణ్య, ఊయక కళావతి, ఊయక సత్యవతి, మెల్లిక కమల, ఊయక జయసుధ, ఊయక రామస్వామి ఉన్నారు. వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి పరామర్శించారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

సంఘటనా స్థలాన్ని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. అధిక లోడ్ తో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీ కొనడం వల్లే ప్రాణ నష్టం ఎక్కువగా జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక బోర్డులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు తక్షణమే చర్యలు చేపడతామన్నారు. తక్షణమే ఓవర్ లోడ్లతో వెళుతున్న లారీలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయనతో పాటు అదనపు అదనపు దిలీప్ కిరణ్, సిఐ కొమరాడ ఎస్ఐ జగదీష్ నాయుడు తదితరులు ఉన్నారు.

అంటివలసలో మిన్నంటిన రోదనలు

పెళ్లి శుభకార్యానికి వెళ్లి తిరుగుముఖంలో సరదాగా మాట్లాడుకుంటూ వస్తున్న వారిని మృత్యువు రూపంలో లారీ కబళించడంతో అటు అటు మృతుల స్వగ్రామమైన అంటివలసతోపాటు, తుమ్మలవలస గ్రామంలోను విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకూ తమతోపాటు సందడిగా గడిపిన వారంతా.. ఇక లేరన్న విషయం తెలిసి గ్రామస్తులంతా ఉలిక్కిపడ్డారు. గ్రామంలోను, ఆసుపత్రిలోను మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతి చెందిన వారంతా రోజువారి కూలీలు, గిరిజనులు కావడంతో ఆ గ్రామంలో రోదనలు మిన్నంటాయి. ఒక్కొక్క కుటుంబానిదీ ఒక్కో విషాద గాథ. ప్రమాదంలో మతి చెందిన మెల్లిక శారద కుటుంబ పరిస్థితి చాలా దారుణం. భర్త శంకర్రావు రెండు కళ్ళు కనిపించకపోవడంతో ఇంటివద్దే ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సుస్మిత, శ్రావ్య, కుమారుడు రాఘవ ఉన్నారు. వీరి కుటుంబ పోషణంతా శారద రోజువారి కూలి పని చేస్తూ నెట్టుకొస్తుంది. శుభకార్యానికి వెళ్లిన తల్లి తిరిగి వస్తుందని పిల్లలు, భర్త ఎదురుచూస్తున్నారు. శారద భార్య రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలిసి పిల్లలు ఇంటి వద్ద రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

సిపిఎం కార్యకర్తగా ప్రజల పక్షాన పోరాడుతున్న ఊయక వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తమ కుటుంబంలో శుభకార్యం కావడంతో ఆటోలో భార్య, కుమార్తెను కూడా తీసుకెళ్లాడు. ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో అతని భార్య లావణ్యకు కూడా తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కుమార్తె అలేఖ్య కూడా స్వల్ప గాయాలతో బయటపడింది. ఒకే కుటుంబంలో ఇలా ముగ్గురు ప్రమాదానికి గురి కావడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు వినిపిస్తున్నారు.

కుమార్తె పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ ఊయక లక్ష్మి మృతి చెందడం, ఆమె భర్త రామస్వామి తీవ్రంగా గాయపడడంతో ఆకుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వీరికి కుమారుడు ప్రవీణ్, కుమార్తె స్నేహలత ఉన్నారు. ప్రమాదంలో మతి చెందిన అమ్మడమ్మకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు, నరసమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

క్షత గాత్రులకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న వెంటనే సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు వై.మన్మధరావు, వి.ఇందిర, కొమరాడ సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఏరియా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. మృతి చెందిన గిరిజన కుటుంబాలను ఐటిడిఎ అధికారులు, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.



క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నంటున్న సిపిఎం నాయకులు



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా

గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదు

- రోజుకు రూ.25కోట్లు బిల్లులు మంజూరు
- నెలిపర్తి లేఅవుట్‌ను పరిశీలించిన హౌసింగ్ ఎమ్‌డి

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత లేదని హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా చెప్పారు. పట్టణంలోని నెలిపర్తిలో గల లేఅవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకు ఐదు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. గృహ నిర్మాణంలో సమస్యలు తెలుసుకునేందుకు తాను జిల్లా పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. లేఅవుట్లలో ఏవిధమైన సమస్యలున్నా పరిష్కరిస్తామని చెప్పారు. లబ్దిదారులకు నాణ్యమైన సిమెంట్, ఇనుము తక్కువ ధరకు సరఫరా చేస్తున్నామన్నారు. లేఅవుట్లలో విద్యుత్, తాగునీరు, ఇంటర్నల్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోజుకు రూ.25కోట్ల మేరకు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్దిదారులకు అవగాహన కల్పించి పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. నెలిపర్తి లేఅవుట్‌లో ఇళ్లు నిర్మాణం తీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గుమడాం లేఅవుట్ -5లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అవసరమైతే మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ రఘురాం, డిఇ సోమేశ్వర రావు, ఎఇ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, ఎఇ సూరి నాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పార్వతీపురం/ సీతానగరం : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి లక్ష్మీశా అన్నారు. తొలుత సీతానగరం మండలం కాసాపేటలో ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ప్రారంభంకాని ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. పునాదులు, లింటల్, రూఫ్ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ప్రతి వారం పురోగతి సాధించాలని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ, కనెక్షన్ లేదని లబ్ధిదారులు తెలియజేయగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం మాట్లాడుతూ ఈ గ్రామంలో 8 ఇళ్లు పూర్తయ్యాయని, 26 ఇళ్లకు స్లాబ్ వేయాలని వివరించారు. మొత్తం 59 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఆయన చెప్పారు. ఆయన వెంట హౌసింగ్ డిఇ ప్రసాద్, ఎఇ జానకీరాం, పంచాయతీ కార్యదర్శి మురళీ కృష్ణ, వర్క్ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

నేడు ఉత్తరాంధ్ర పౌరాణిక పద్య నాటిక పోటీలు

విజయనగరం : కీర్తిశేషులు బొద్దుల గురునాయుడు ప్రథమ వర్ధంతిని పురష్కరించుకుని ద్వారపూడి గ్రామంలో గురువారం ఉత్తరాంధ్ర పౌరాణిక నాటకాలు నిర్వహిస్తున్నామని బొద్దుల గురునాయుడు కుమారులు బొద్దుల నర్సింగరావు, బొద్దుల రమణ, బొద్దుల ఆనంద్ తెలిపారు. బుధవారం తమ స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23వ తేదీన ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పౌరాణిక పద్య నాటిక పోటీలు, బహుమతి ప్రధానోత్సవం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ తండ్రికి పౌరాణిక పద్య నాటికలు అంటే ప్రాణమని, అందుకే ఆయన వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ విభాగంలో మొదటి, ద్వితీయ, తతీయ బహుమతులు, ఐదు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామన్నారు.

కార్పొరేట్లకు రాయితీలు.. సామాన్యులపై భారాలు

- హోదా, విభజన హామీలపై మరోసారి మోసం
- సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కురుపాం

బిజెపి ప్రభుత్వం కార్పొరేటర్లకు రాయితీలిస్తూ, సామాన్యులపై భారాలు వేసే ప్రజా వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టిందని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి ముందు కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి మెయిన్ రోడ్డు మీదగా రావాడ జంక్షన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ర్యాలీని ఉద్దేశించి వేణు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, పేద ప్రజల డబ్బు కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై కేంద్రం భారాలు వేసిందని విమర్శించారు. ఈ బడ్జెట్లో ఉపాధి హామీకి రూ.30 వేల కోట్లు, ఆహార సబ్సిడీలో ఏకంగా రూ.90 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఎరువులపై సబ్సిడీలు రూ.50 వేల కోట్లకు, వ్యవసాయ రంగానికి ఐదు శాతం గత బడ్జెట్ కంటే తగ్గించిందని అన్నారు. అలాగే రాష్ట్రానికి - మొండిచేయి చూపిందన్నారు. ప్రత్యేక హెూదా, విభజన హామీలను అమలు చేయకుండా బిజెపి ప్రభుత్వం మరోసారి మోసం చేసిందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం, విశాఖ మెట్రోకు నిధుల ఊసే లేదని విమర్శించారు. సంపద సృష్టిస్తున్న కార్మికుల కోసం కనీసం ప్రస్తావన లేదన్నారు. ఉపాధి కల్పన ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలని డిమాండ్ చేశారు. ఆహార పదార్థాలు, మందులతో సహా నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలు, కోతలకు వ్యతిరేకంగా ఈనెల 24న మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నామని, ఇందులో పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు, వై.మన్మధరావు, వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, సీనియర్ నాయకులు మండంగి రమణ, కె.సీతారాం, సన్యాసిరావు, వాసు, నియోజకవర్గంలో గల ఐదు మండలాల సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సుస్థిర అభివృద్ధి సాధనకు పని చేయాలి

- ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించాలి
- రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

మానవాభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలని రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు సుస్థిర అభివృద్ధి, స్పందన కార్యక్రమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 సుస్థిర అభివద్ధి సూచీలను ప్రాధాన్యతలుగా తీసుకొని 2030 నాటికి శతశాతం సాధించే దిశగా లక్ష్యాలను నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇందులో ప్రధానంగా సామజిక, ఆర్థిక, పర్యావరణ, పీస్ అండ్ పార్టనర్‌షిప్ అంశాలు ఉన్నాయని తెలిపారు. నీతి అయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్.డి.జి సుచీలలో జిల్లా స్థాయి లో 61 , గ్రామ, వార్డు స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మాపింగ్ చేశామన్నారు. సూచీలన్నింటినీ నెరవేరిస్తే కొన్ని తరాల వరకు అభివృద్ధి చేసిన వారమవుతామని అన్నారు.

నిర్ణీత గడువులో పరిష్కరించిన వారికి అభినందనలు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించినందుకు కలెక్టర్లను, అధికారులను సెక్రటరీ అభినందించారు. అర్జీ సమాధానం పంపిన 24 గంటల్లో అర్జీదారు నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, అర్జీదారు ఫోటో, సమస్య ముందు, తర్వాత ఫోటో ను, అర్జీదారుకు రాసిన సమాధానపు ప్రతిని సంబంధిత అధికారి అప్‌లోడ్ చేయాలని అన్నారు. జిల్లాలో 13శాతం రీఓపెన్ అర్జీలు ఉన్నాయని, 42శాతం అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఎక్కువగా రెవిన్యూ, హౌసింగ్, సచివాలయ సేవలు, సిబ్బందిపై అర్జీలు అందుతున్నాయని, ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో కూడా ఎందుకు ఎక్కువగా వస్తున్నదీ పరిశీలించాలని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా జెసి ఓ.ఆనంద్ మాట్లాడుతూ గిరిజన బాలికల్లో రక్త హీనత ఎక్కువగా ఉందని, తగ్గించడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం జాయింట్ మయూర్ అశోక్, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్, డిఆర్ఒలు గణపతి రావు, వెంకటరావు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్

చిరకాల వాంఛ నెరవేరింది

వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 150 సీట్లతో తరగతుల ప్రారంభానికి అనుమతి ఇవ్వడం ద్వారా జిల్లా ప్రజలు చిరకాల వాంఛను ముఖ్యమంత్రి నెరవేర్చారని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జిశ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల ఈ ప్రాంత వాసులు కల, మెరుగైన వైద్యం కావాలనే కోరికను సిఎం నిజం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. 2014లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పినా జీవో ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. 2019 ఎన్నికలు సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం సామాజిక న్యాయం చేస్తామని చెప్పిన విధంగా మహిళలకు 50 శాతం పదవులు ఇస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో 18 మందిలో 14 మంది ఎమ్మెల్సీ లు బిసి, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో రైతులకు, అక్కడి ప్రజలకు ఇవ్వాల్సిన అర్ అండ్ అర్, పునరావాస చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలు కోడ్ పూర్తయిన వెంటనే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టుల పెండింగ్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - గుర్ల

ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. మండలంలో తారకరామతీర్థ సాగర ప్రాజెక్టు బ్యారేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలసి సందర్శించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పరిశీలనలో భాగంగా తారకరామతీర్థ సాగర ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లడుతూ 2005లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ నేటి వరకు పూర్తి కాకపోవడం ప్రభుతాలు, పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇందుకు ప్రభుత్వాలు సిగ్గు పడాలన్నారు. ఎటువంటి ఆటంకాలు లేని ఈ ప్రాజెక్ట్‌కు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయడానికి ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నిర్వాసితులకు రూ. 90 కోట్లు చెల్లించవలసి ఉందనీ, ఈ మాత్రం నిధులు ప్రభుత్వం వద్ద లేవా అని ప్రశించారు. రూ. 450 కోట్లు ఖర్చు చేస్తే ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి అవుతాయని, ఇందుకోసం ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం కావాలన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు రెండుసార్లు రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా ఈ ప్రాజెక్టులు వెనుకబాటుతనం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో అసంపూర్తిగా ప్రాజెక్ట్‌లను చూసి మంత్రి ధర్మాన సిగ్గు పడాలన్నారు. రైతులు బాగు కోరేవారైతే ఈ విధంగా ఉండే వారు కాదన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు విషయంలో మోసం చేస్తుందన్నారు. రాష్ట్రం మొత్తం పర్యటించి పెండింగులో ఉన్న అన్ని ప్రాజెక్టులకు నిధులు కేటాయించలని ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు. తారకరామా తీర్థ సాగర ప్రాజెక్టు పూర్తయితే నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉన్న పూసపాటి రేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరానికి తాగు నీరు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జెవి సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి వర్గ సభ్యులు ఈశ్వరయ్య, ఓబులేష్, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు బుగత అశోక్, అలమండ ఆనందరావు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు నెలకు రూ.2500 పెంచాలి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న 3, 4 తరగతుల విద్యార్థులకు మెస్‌ఛార్జీలు రూ.2500కు పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం 3,4 తరగతులకు రూ.1150, 5 నుంచి 10 తరగతులకు రూ.1400, ఇంటర్, ఆపై చదువులకు రూ.1600 పెంచినట్లు ప్రకటించడం దారుణమని అన్నారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ రావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి ఐదేళ్లు అవుతోందని, నిత్యవసర ధరలు ఆకాశమంత ఎత్తు పెరిగితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నామ మాత్రంగా మెస్‌ఛార్జీలు పెంచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూకు ఈ డబ్బులు ఏమాత్రమూ సరిపోవని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సంక్షేమ హాస్టల్లో పౌష్టికాహారం అందాలంటే నెలకు రూ.2500 పెంచాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటం చేస్తామని అన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



పట్టణంలో ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థిని బలపరచాలి

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అభ్యర్థిత్వాన్ని బలపర్చి గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం పాలకొండలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, ప్రజానాట్యమండలి కార్యదర్శి బి.పద్మా తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు శ్రీశ్రీ రచనలు దోహదం

సీతానగరం : సమాజంలో మార్పులకు శ్రీశ్రీ రచనలు ఎంతో దోహదపడతాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.లక్ష్మునాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం రెడ్ బుక్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం వల్ల ఉపాధి రహిత అభివృద్ధి జరుగుతుందని, నిరుద్యోగం పెరుగుతుందని అన్నారు. ఉన్న ఉద్యోగాలకు భద్రత లేదని, దేశ సంపద కొంతమంది వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సమాజ మార్పునకు, దోపిడీ వర్గాలపై ప్రతిఘటించాలని, శ్రీ శ్రీ రచనలు, కవితలు సమాజ మార్పుకు ఉపయోగపడతాయని అన్నారు. అభ్యుదయ రచనలు, చదువుతూ సమాజాన్ని మార్చుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, బి.అప్పారావు, సిహెచ్.కృష్ణ, వై.శాంతి తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు కమిషనర్‌కు పలువురు పరామర్శ

పాలకొండ : నగర పంచాయతీ పూర్వపు కమిషనర్ లిల్లీ పుష్పనాథంను బుధవారం పలువురు పరామర్శించారు. ఇటీవలే అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న ఎంపిపి బొమ్మాలి భాను, నగర పంచాయతీ చైర్ పర్సన్ యందవ రాధాకుమారి, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, పనుకువలస ఎంపిటిసి సభ్యులు కోట అజయ్, మరియదాసు, రుంకు రామకృష్ణ, గోవిందు, మోహన్, తదితరులు ఉన్నారు.

దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

పాలకొండ రూరల్ : రాష్ట్రంలో దళిత సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో దళిత వాడలను అభివృద్ధి చేయాలని ఆలిండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా ప్రతినిధి బత్తిని మోహన్ కోరారు. రాష్ట్రంలో దళిత సంక్షేమ పథకాలు అమలులో జాప్యం జరుగుతుండటం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు దళిత, గిరిజన సంఘాలతో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా దళిత రైట్స్ ఫోరం మండల అధ్యక్షులు రాయి రామకృష్ణ, మండల ప్రతినిధులు మండల లక్ష్మణరావు, వెలగాడ రాజు, సాయి, నల్లబారిక సురేష్, పొట్నూరు రమేష్, భోగి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

స్వచ్ఛంద సంస్థలు పనితీరు ఆదర్శనీయం

కురుపాం : ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగు నీరందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ఆదర్శనీయమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో గల మంతినివలస సమీపంలో ఎటర్నల్ లైట్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్యూనిటీ బోరు వెల్స్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా లక్ష రూపాయల వ్యయంతో తీసిన మంచినీటి బోరును బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు తాగు నీరందించడం అద్భుతమని, అలాగే గిరిజన గ్రామాల్లో గిరిజనులకు తాగు నీరందించడంతో పాటు, ప్రజాహిత కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వెన్నా విజయ్, కన్వీనర్ ఎస్.ప్రసంగి, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, జెడ్పీటిసి జి.సుజాత, స్థానిక సర్పంచ్ జి.సుజాత,ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, సంస్థ కార్యదర్శి జి.రామారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండల కేంద్రంలోని బిసి కాలనీలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, వృద్ధులు, చంటి పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధిగ్రస్తులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, ఎంఎల్ హెచ్‌వి భాగ్యరాధ, ఎఎన్ఎం ఉష, టెక్నీషియన్ దినేష్, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి కైలాసనాథ స్వామి జాతర

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలో గల కైలాసనాథ స్వామి జాతర ఈనెల 17 నుంచి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఎంతో అట్టహాసముగా నిర్వహించనున్న కైలాసనాథ ఆలయ వార్షికోత్సవ సంబరాల్లో భాగంగా పంచమ రాత్రి యాత్ర కార్యక్రమాల ప్రణాళికలను ఆలయ గౌరవ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణుప్రసాద్, ఆలయ ధర్మకర్త గుడ్ల వెంకటరావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్వాహకులు మాట్లాడుతూ కైలాసనాథ స్వామి ఆలయ కమిటీ సమిష్టి కృషితో ప్రజలు, అధికారులు సహకారంతో జయప్రదం చేయాలని అన్నారు. కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులను కలిసి యాత్ర నిర్వహణకు అనుమతులు కోరాలని, అలాగే ప్రతి కమిటీ సభ్యుడు బాధ్యతగా కార్యక్రమంలో పాల్గొని నిస్వార్థంగా సేవలు అందించాలని నిర్ణయించడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు సొంటేన సురేష్, పైడ నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుభక్తి చాటుకున్న శిష్యుడు

భామిని : తనలాగే తన గురువు కుమారుడు కూడా ఉన్నత విద్యను అభ్యసించి, మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించాడు ఓ శిష్యుడు. తనకు నైతికత, విద్యాబుద్ధులు నేర్పి, తాను ఈ రోజు ఉన్నత ఉద్యోగంలో స్థిరపడ్డానికి కారణమైన ఉపాధ్యాయుడి (ప్రైవేట్ పాఠశాల) కుమారుడికి లేప్‌టాప్ అందజేసి గురుభక్తిని చాటుకున్నాడు ఆ శిష్యుడు. మండలంలోని ఒన్న గ్రామానికి చెందిన బోగాపురపు మాధవరావు ఇదే మండలంలోని గజపతినగరంలోని ఓ ప్రవేయిట్ పాఠశాలలో చదివి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు పొడ్డిన అప్పలనాయుడు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దారు.. అయితే గురువు పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో ఆయన కుమారుడు కాశీప్రసాద్ బాగా చదువుకోవాలని ఆకాంక్షించిన మాధవరావు లేప్‌ట్యాప్ అందజేసి గురుభక్తి చాటుకున్నాడు. ఈ ల్యాప్‌టాప్‌ను పూర్వ ఉపాధ్యాయులు సన్యాసిరావు చేతుల మీదుగా అందజేశారు.



విద్యార్థికి లాప్‌టాప్ అందజేస్తున్న పూర్వ ఉపాధ్యాయుడు సన్యాసిరావు

రోడ్డు పనులను పిఒ తనిఖీ


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం/కురుపాం

ఏజెన్సీ గ్రామాల్లో చేపడుతున్న సిసి రోడ్లు, కాలువల పనులను ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. తొలుత గుమ్మలక్ష్మీపురం మండలంలో సిసి రహదారులు, కాలువలు, వరద నివారణ కరకట్టల పనులను తనిఖీ చేశారు. అనంతరం కురుపాం మండలం మంతినివలస, నేరేడు వలస గ్రామాలను, గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు గూడ, కేసరి గూడ కొండ శిఖర గ్రామాలను సందర్శించారు. పనుల నాణ్యతలో రాజీ ఉండరాదని పేర్కొన్నారు. అన్ని గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు ఉండాలని ఆయన ఆదేశించారు.

జిసిసి గోడౌన్ పరిశీలన

గిరిజన సహకార సంస్థ గిడ్డంగులు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గ్యాస్ గోడౌన్, జిసిసి పెట్రోల్ బంక్‌లను ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. వీటి నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అటవీ ఫలసాయం కొనుగోలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు లాభదాయకత ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట జిసిసి డివిజనల్ మేనేజర్ వి. మహేంద్ర కుమార్, గిరిజన సంక్షేమ శాఖ డిఇ తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ ప్లాంటేషన్ సందర్శన



జిసిసి గోదామును పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

అనంతరం కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయిలో గల హార్టికల్చర్ ప్లాంటును పిఒ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారులకు ప్లాంటేషన్ విస్తీర్ణం, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ప్లాంటేషన్ అభివృద్ధికి పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ సిబ్బంది ఐటిడిఎ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించాలని పట్టణంలోని 25, 26 వ వార్డుల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా వార్డుల్లో గత మూడు, నాలుగు రోజులుగా తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించకపోవడంతో మహిళలు తాగునీరు పట్టుకునేందుకు అవకాశం లేకుండా పోతుందని వాపోతున్నారు. కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా ఉదయాన్నే జరిపితే పట్టుకునేందుకు అవకాశం ఉంటుందని, ఆ సమయం దాటి తాగునీరు సరఫరా చేయడం వల్ల విధులకు వెళ్లాల్సిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మహిళలు తాగునీరు పట్టుకునేందుకు అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరా ఉదయాన్నే ఇవ్వాలని కోరుతున్నారు.

25న వాహనాల వేలం పాట

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 25న పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మూడు ఆటోలు, నాలుగు ద్వి చక్రవాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు టౌన్ ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆర్.సుధాకర్ పర్యవేక్షణలో వాహనాల వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేలంపాటలో పాల్గొనవచ్చునని ఎస్ఐ పాపారావు ఒక ప్రకటనలో కోరారు.

25,25 తేదీల్లో ఇఫ్టూ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - పార్వతీపురం

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) 9వ రాష్ట్ర మహాసభలు ఈనెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళం పట్టణంలో జరుగుతున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు అన్నారు. ఈ మహా సభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న కళాసీ సంఘం జెండా స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 25,26 తేదీల్లో శ్రీకాకుళంలోని కళింగ భవన్‌లో జరగనున్న రెండు రోజుల మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభల్లో కార్మిక వర్గ సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రధానంగా 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా మార్చడంపై చర్చించి ఆందోళనా కార్యక్రమాలకు మహాసభ పిలుపునిస్తుందని అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, వర్తక కళాసీ సంఘం కార్యదర్శి రాగోలు సర్వేశ్వరరావు, సభ్యులు చిన్నారావు, కళాసీలు పాల్గొన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా 24న ధర్నాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ కు నిరసనగా ఈనెల 24న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కమిటీ సభ్యులు పట్టణంలోని 24,25 వార్డుల్లో బుధవారం కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు మాట్లాడుతూ ప్రజల నెత్తిన అప్పులు చేసి కార్పొరేట్లకు పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వబడ్జెట్ ఉందని విమర్శించారు. మోడీ బడ్జెట్లో ఉపాధి హామీకి, వ్యవసాయ రంగానికి, ఎస్సీ, ఎస్టీలకు విద్య, వైద్యం రంగాలకు ప్రభుత్వ నిధులు కేటాయింపులు పెంచాలని, ఉద్యోగ, ఉపాధికి నిధులు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ముట్నూరు వెంకటరమణ(బుచ్చిబాబు), వరప్రసాద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : కేంద్ర బడ్జెట్ వ్యతిరేకంగా ఈ నెల 24న స్థానిక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ధర్నా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కోరారు.

సాలూరు: ఇటీవల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీ, బిసి, కార్మికులను మోసం చేసేలా ఉందని సిపిఎం పట్టణ



పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

నాయకులు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రజలను మోసం చేసే తీరు గురించి వివరించే కరపత్రాలను పట్టణ అధ్యక్షులు టి.రాముడు, నాయకులు టి.ఇందు, జె.స్వప్న విడుదల చేశారు. మోడీ ప్రభుత్వ మోసాలు గురించి పట్టణంలో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేట్లకు దోచి పెట్టడమే బిజెపి విధానమని, ప్రజలు తిప్పికొట్టాలని కోరారు.

హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి కలెక్టరేట్

విద్యార్థులు తమ హక్కులేమిటో తెలుసుకోవాలని జాతీయ వినియోగదారుల సమన్వయ సమితి (సిసిఐ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్.హరిబాబు అన్నారు. బుధవారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో ఆధ్వర్యంలో బుధవారం అడగండి చెప్తాం - విద్యార్థులు.. హక్కులు తెలుసుకోండి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ టోల్ ఫ్రీ నెంబర్ ని 1967 ను ప్రవేశపెట్టిందన్నారు. ఆన్ లైన్ లో జరిగే మోసాలపై 1930 ను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఐఎస్ఐ ప్రమాణాలు, ఐఎస్ఐ ముద్రను తీసుకోకుండా నడుపుతున్న ఆర్ఒ ప్లాంట్లపై విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ పి.వెంకటరమణ మాట్లాడుతూ రంగులు వేయని ఆహార పదార్థాలను కొనుగోలు చేయాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పిజ్జా, బర్గర్లు, మంచూరియా, చికెన్ ఫ్రైడ్ రైస్, ఎగ్ ఫ్రైడ్ రైస్ తిని ఆరోగ్యాన్ని చెడగొట్టుకోవద్దని సూచించారు. సిసిఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ఆహార నియంత్రణ అధికారులు సిబ్బంది తక్కువ ఉన్నందున కల్తీ ఆహార తయారీదారులపై సరైన నియంత్రణ ఉండడం లేదన్నారు. దీనివల్ల కల్తీ ఆహారం తిని వినియోగదారులు ఆసుపత్రి పాలవుతున్నారని అన్నారు. సిసిఐ మీడియా ప్రతినిధి రామకష్ణ మాట్లాడుతూ ప్రక్క రాష్ట్రంలో సంచార ఆహార తనిఖీ ప్రయోగశాల వాహనాలు ఇప్పటికే 10 ఉన్నాయని అన్నారు. సిసిఐ రాష్ట్ర సహాయ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల సంఘం నాయకులు

కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు మాట్లాడుతూ పాలతో తయారుచేసిన స్వీట్స్ ప్యాకెట్స్‌పై తప్పనిసరిగా ఎక్స్‌పైర్డ్ డేట్ ముద్రించాలని, లేని షాపుల వివరాలను తెలియపరిస్తే సంబంధిత అధికారులతో తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. టేస్టీ సాల్ట్ అత్యంత ప్రమాదకరమైందని, వెనిగర్, సాసుల ప్రమాదాన్ని, ఈ ఆహారాన్ని తీసుకున్న వాటివల్ల వచ్చే జబ్బుల గురించి వివరించారు. మోతాదుకు మించి వాడే టెస్టింగ్ సాల్ట్, టమాటా సాస్ ఇవన్నీ కూడా నాడీ వ్యవస్థను దెబ్బతీస్తాయని, బుద్ధి మాంద్యం కలిగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేట బాలకష్ణ, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, స్థానిక వినియోగదారుల సంఘ నాయకులు మన్యం రామకృష్ణ, వారణాసి శ్రీహరి, లక్ష్మణరావు, మహిళా మండలి నాయకురాలు రాణి, కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవనాయుడు

పెదపెంకిలో చలివేంద్రం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు చలివేద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని నాలుగు నెలల పాటు దీన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు దీన్ని నిర్వహించడానికి స్నేహచైత్ర ఫౌండేషన్ అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు, అల్లు సత్యం, పట్నాయక్ సహకరించినట్లు తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికను గ్రంథాలయానికి అదే గ్రామానికి చెందిన జన్ని చింతాడ అందజేశారన్నారు. ఈ మేరకు ఆయన సంజీవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వి.శివునాయుడు, కె.గౌరీనాథ్, కె.సంతోష్, బి.సంతోష్, కె.బాబురావు, ఎ.దయ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న డిపిఎం షణ్ముఖరావు, సిబ్బంది

అంతర్ పంటలతో మరింత ఆదాయం

ప్రజాశక్తి - కొమరాడ

పామాయిల్ సాగులో అంతర్ పంటగా ఇతర పంటలు వేసుకుంటే రైతులకు మరింత ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ షణ్ముఖ రాజు అన్నారు. మండలంలోని చెక్కవలసలో ప్రకృతి పద్ధతి సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పామాయిల్ పంటలో పూర్తిగా ఎరువులు, పురుగు మందులు వాడకుండా అంతర్ పంటలు వేసుకొని ద్రవ, ఘనజీవామృతంలో వాడుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. రానున్న ఖరీఫ్ వరికి ముందు నవధాన్య విత్తనాలు 30 రకాలు పంటలు వేసుకోవడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. వాటిని 45 రోజుల తర్వాత కలియ దున్ని వరి వేసుకుంటే వాటిలో ఎటువంటి రసాయనికి ఎరువులు, పురుగు మందులు వాడకుండా పండించవచ్చని, దేశీయ వరి వంగడాలు వేసుకుంటే వాటిని ఈ సంవత్సరం మార్కెట్ కూడా తీసుకుంటామని అన్నారు. రైతులంతా తమ ఇంటి వద్ద అన్ని రకాలైన పౌష్టికరమైన కూరగాయలు పండించుకుంటే అవి తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమానికి అడిషనల్ డిపిఎం ధనుంజయ్, ఎం.అప్పలనాయుడు రైతులు ఉన్నారు.

జోరుగా రన్నింగ్ ట్రాక్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటలో గల మినీ క్రీడా మైదానంలో రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు సహాయ సహకారాలు అందించారు. ఈ మైదానంలో గత నెల రోజుల నుంచి నిరుద్యోగ యువత పోలీసు రిక్రూట్మెంట్ కొరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. మైదానంలో రన్నింగ్ ట్రాక్ సక్రమంగా లేనందున క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు పోలీసులు స్పందించి తక్షణమే రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారని అన్నారు. దీంతో గత రెండు రోజుల నుంచి మినీ క్రీడా మైదానంలో రన్నింగ్ ట్రాక్ నిర్మాణానికి జెసిబితో పనులు చేయిస్తున్నారు. ఏజెన్సీ మండలాల నుంచి పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ శిక్షణ కోసం సుమారు 30 మందికి పైగా అభ్యర్థులు పోటీ పరీక్షలో అర్హత సాధించారని అన్నారు. ఈ మేరకు ఫిజికల్ శిక్షణ కోసం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి వైకుంఠరావు, కొండవాడకు చెందిన మరో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రమోహన్, జాతీయ స్థాయి పరుగు పందెం లో మెడల్స్ సాధించిన



చురుగ్గా సాగుతున్న ట్రాన్ నిర్మాణ పనులు

కె.జోగులు, పోటీదారులతో పాల్గొని మరికొన్ని కొత్త మెలకువలను, అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ మేరకు పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ శిక్షణ కోసం అభ్యర్థులు మైదానానికి వచ్చి వినియోగించుకోవాలని కోరారు.

సోలికిరిలో గంగా హారతి


ప్రజాశక్తి - భామిని

బాలేరు పంచాయతీ పరిధిలో గల మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో భాగంగా వేదపండితులు నడుమ వంశధార తీరంలో గంగహారతి కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం దేవతా విగ్రహాలకు వంశధార నదిలో స్నామాచారించి, విచ్చిసిన భక్తులకు అన్నప్రాసదాలను పంచిపెట్టారు. కార్యక్రమం బాలేరు ఎం పి టి సి కొత్తకోట చంద్రశేఖర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మెడిబోయిన చలపతిరావు, స్థానిక సర్పంచ్ జామి ప్రభాకర్, వై సి పి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామ సమీపంలో ఉన్న పంట పొలాల్లో గంట చిన్నమ్మి (62) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వంగర పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 20వ తేదీన తన కుమార్తెలు కళావతి, పుణ్యవతి గ్రామమైన నీలయ్య వలస నుంచి స్వగ్రామం కొండచాకరాపల్లికి బయలు దేరిన ఆమె ఆచూకి అదే రోజు మధ్యాహ్నం నుండి కనిపించలేదు. బుధవారం కొండచాకరాపల్లి రావి పొలం సమీపంలో మొక్కజొన్న పొలంలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. మృతురాలి కుమార్తె పుణ్యవతి స్థానిక పోలీసులకు సమాచారం అందించింది. తన తల్లి మెడలో, చెవిలో ఉన్న బంగారు ఆభరణాలు పూర్తిగా గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుని తన తల్లిని హతమర్చి ఉంటారని ఆరోపిస్తూ తమ ఆవేదనను పోలీసులు ఎదుట వెల్లగక్కింది. రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర, వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం విజయనగరం డాగ్ స్క్వాడ్ బృందం ఇక్కడికి వచ్చి ఘటన జరిగిన ప్రదేశంలో తనిఖీలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ

నిర్వహించాయి. మృతదేహాన్ని రాజాం సిహెచ్‌సికి తరలించారు. అమె మెడలో ఉన్న బంగారు వస్తువులు కోసం గుర్తు తెలియని దుండగలు హత్య చేసి ఉంటారని భావిస్తూ హత్య కేసుగా నమోదు చేశామని సిఐ తెలిపారు.

సముద్రంలో మత్స్యకారుడు మృతి

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లికి చెందిన బెవర మసేను (24) కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు సముద్రంలో వేటాడుతూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. ఈ విషయమై తోటి వేటగాళ్లు బుధవారం కుటుంబీకులకు సమాచారం అందించారు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందడంతో తోటి వేటగాళ్లు అతని మృతదేహాన్ని ఒడ్డికి చేర్చారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం చింతపల్లికి గురువారం తరలిస్తారని మత్స్య కర్ నాయకులు బర్రి చిన్నప్పన్న తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.



మృతి చెందిన మసేను

బైక్ ఢీకొని సైకిలిస్టుకు గాయాలు

గంట్యాడ : మండంలోని కరకవలస సమీపంలోని పప్పుల మిల్లు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడుకు గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నరవ గ్రామానికి చెందిన ఎర్రిబోతుల చిట్టిబాబు భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి సైకిల్‌పై తిరిగి వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న చిప్పాడ రమణ ఢీ కొన్నాడు. ఈ ఘటనలో చిట్టిబాబుకు తీవ్రగాయాలయ్యాయి.